సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 4 । మే । 2023



వానలతో వ్యాధుల ముప్పు

వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

8లో ▸



కొల్లేరు బెల్ట్ భూముల సర్వే

కొల్లేరు గ్రామాల్లో అక్రమ భూముల గుట్టు రట్టు కానుంది. సర్వేకు ఏలూరు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

8లో ▸



ఐదుగురి అరెస్టు

పోక్సో కేసులో బొర్రంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

8లో ▸

న్యూస్‌రీల్

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

ఆకివీడు: ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి గురువారం ఉండి నియోజకవర్గ పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమవుతారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు భీమవరం యూత్ క్లబ్‌లో ఉండి, పాలకోడేరు, మధ్యాహ్నం 2 గంటలకు ఆకివీడు, కాళ్ల మండలాల నాయకులతో సమావేశమవుతారని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ ప్రగతిపై సమీక్షిస్తారన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



విలేకరులతో మాట్లాడుతున్న డీపీఓ మల్లికార్జునరావు

మొగల్తూరు: గ్రామాల్లో లక్షలాది రూపాయలతో నిర్మించిన సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు ఆదేశించారు. మండలంలోని కేపీపాలెం, పేరుపాలెం గ్రామాల్లోని సంపద కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఎత్తివేసేలా పంచాయతీలకు రిక్షాలు అందజేశామన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి పంచాయతీలో ముగ్గు, బ్లీచింగ్, ఫినాయిల్ సిద్ధంగా ఉంచుకోవాలని పంచాయతీలకు సూచించామన్నారు. గ్రామాల్లోని అనధికార లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేస్తే పంచాయతీలకు సంబంధం లేదన్నారు. ఈవోపీఆర్డీ రవికిరణ్ మాట్లాడుతూ మండలంలో సుమారు 33 అనధికార లేఅవుట్‌లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామాల్లోని పంచాయతీ స్థలాలు, చెరువులు కబ్జాకు గురైతే వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట నరసాపురం, మొగల్తూరు ఎంపీడీఓలు శ్రీనివాస యాదవ్, ఆర్‌సీ ఆనంద్‌కుమార్, కార్యదర్శులు జయరాజు, చిన్నా ఉన్నారు.

6న వాలీబాల్ శిక్షణకు ఎంపిక

సాక్షి, భీమవరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల, వసుధ ఫౌండేషన్ సహకారంతో వాలీబాల్ శిక్షణకు ఈనెల 6న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జీబీ పవన్‌కుమార్‌రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఎన్నార్ కళాశాలలోని గన్నాబత్తుల క్రీడామైదానంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు క్రీడాకారుల ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి నెల రోజులపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 97041 02444, 63035 78996 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అథ్లెటిక్స్ సెలెక్షన్స్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గణపవరం: మంగళగిరిలోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లను బుధవారం గణపవరం డిగ్రీ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 18 మంది బాలురు, ఏడుగురు బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి, పీడీ ఎ.స్వాతి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతకాయల సత్యనారాయణ, దేవరపల్లి ప్రసాద్, పీడీలు బాబూరావు, ప్రసాద్, ప్రదీప్ పర్యవేక్షించారు.

మార్గదర్శిలో కొనసాగిన సోదాలు

తణుకు: తణుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయంలో ఐదో రోజు బుధవారం సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. గత నెల 29 నుంచి ఏకధాటిగా ఇక్కడ సోదాలు జరుగుతున్నాయి. మార్చి 2022 ఆర్థిక సంవత్సరం వరకు చిట్‌లకు సంబంధించి ఖాతాదారుల కాపీలను సేకరించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మేనేజర్ వద్ద కీలకమైన సర్టిఫైడ్ కాపీలను సైతం స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే సీఐడీ సోదాలు జరుగుతున్న నేపథ్యంలో మార్గదర్శి సంస్థకు చెందిన ఒక యాప్ ద్వారా సిబ్బంది నేరుగా ఖాతాదారుల వద్దకు వెళ్లి లావాదేవీలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు సీఐడీ సోదాలు జరుగుతున్నా కార్యాలయంతో సంబంధం లేకుండా యాప్ ద్వారా తణుకు కార్యాలయ పరిధిలో గత నెలలో రూ.3 కోట్లు లావాదేవీలు జరిగినట్టు విశ్వసనీయ సమాచారం.

ఏఎంసీ.. ఆదాయం మెరిసి

వసూళ్లు భేష్

- ఆర్థిక పరిపుష్టి దిశగా మార్కెట్ యార్డులు
- ఏడు చోట్ల లక్ష్యానికి మించి వసూళ్లు
- ప్రథమ స్థానంలో నూజివీడు ఏఎంసీ
- ఉమ్మడి జిల్లాలో 19 మార్కెట్ కమిటీలు



ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో గొడౌన్లు

ఆకివీడు: వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) ఆర్థిక పరిపుష్టి దిశగా ముందుకు సాగుతున్నాయి. రైతులు పండించిన వివిధ రకాల పంటలకు మార్కెట్ యార్డుల్లో విక్రయాల ద్వారా క్వింటాల్‌కు 25 పైసల నుంచి రూ.2 వరకు మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నాయి. ఇలా సమకూరిన ఆదాయంతో రైతులకు ఉపయోగకరంగా పుంత రోడ్ల అభివృద్ధి, రైతు బంధు పథకం వంటివి అమలు చేస్తున్నారు. 2022–23లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మార్కెట్ కమిటీలు రికార్డు స్థాయిలో ఆదాయాన్ని గడించాయి. మొత్తం 19 ఏఎంసీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో మూడు, ఏలూరు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధించాయి. కొన్ని కమిటీలు 124 శాతం వరకు లక్ష్యాన్ని సాధించాయి. మొత్తంగా రూ.104.52 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యం కాగా రూ.94.09 కోట్లు వసూలు చేశాయి. ఇదిలా ఉండగా ఈ ఏడాది (2023–24)లో ఏలూరు జిల్లా పరిధిలోని మార్కెట్ కమిటీల ద్వారా సుమారు రూ.48.45 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని మార్కెట్ కమిటీల ద్వారా సుమారు రూ.65.40 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. బడ్జెట్ ఆమోదం తర్వాత ఆయా మార్కెట్ కమిటీలకు లక్ష్యాలను మార్కెటింగ్ శాఖ ప్రకటించనుంది.

రికార్డుల దిశగా మార్కెట్ కమిటీలు

ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీల పరిధిలోని చెక్ పోస్టుల ద్వారా పన్ను వసూళ్లు చేస్తున్నారు. జిల్లా సరిహద్దులు, మార్కెట్ కమిటీల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉన్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలోని పలు ఏఎంసీలు లక్ష్యానికి మించి పన్ను వసూళ్లు చేశాయి.

- పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి మార్కెట్ కమిటీ పరిధిలో రూ.9.20 కోట్లు లక్ష్యం కాగా రూ.11.42 కోట్లు వసూలు చేసి 124.13 శాతం లక్ష్యాన్ని అధిగమించింది.
- ఆకివీడు మార్కెట్ కమిటీ రూ.5 కోట్లకు గాను రూ.5.06 కోట్లు వసూలు చేసింది.
- పాలకొల్లు మార్కెట్ కమిటీ రూ.5.25 కోట్లకు గాను రూ.5.40 కోట్లు వసూలు చేసింది.
- ఏలూరు జిల్లా పరిధిలో నూజివీడు మార్కెట్ కమిటీ రూ.2.35 కోట్లకు గాను రూ.3.03 కోట్లు వసూలు చేసి ఉమ్మడి జిల్లాలోనే 128.88 శాతం వసూళ్లతో మొదటి స్థానంలో నిలిచింది.
- ఏలూరు మార్కెట్ కమిటీ రూ.2.45 కోట్లకు గాను రూ.2 కోట్ల 45 లక్షల 11 వేలు వసూలు చేసింది.
- పోలవరం మార్కెట్ కమిటీ రూ.4.60 కోట్లకు గాను రూ.4.64 కోట్లు వసూలు చేసింది.
- ఉంగుటూరు మార్కెట్ కమిటీ రూ.4.70 కోట్లకు రూ.4.74 కోట్లు వసూలు చేసింది.

ఆదాయాన్ని సమకూర్చే పంటలివే..

ఉమ్మడి జిల్లాలోని 19 మార్కెట్ యార్డుల ద్వారా చేపలు, రొయ్యలు, వరి, నిమ్మ, మొక్కజొన్న, కాటన్, కొబ్బరికాయలు తదితర పంటల విక్రయాలకు మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2, ఇతర పంటలకు క్వింటాల్ రూపాయి, చేపలకు 50 పైసలు, ఎగుమతి చేసే రొయ్యలకు 25 పైసలు, స్థానిక మార్కెట్‌లలో విక్రయించే రొయ్యలకు 50 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు.

95.22 శాతం వసూళ్లు



ఏలూరు జిల్లా పరిధిలోని 9 మార్కెట్ కమిటీల ద్వారా గతేడాది 95.22 శాతం పన్ను వసూలు చేశాం. లక్ష్యాన్ని మించి నాలుగు కమిటీలు అధిక ఆదాయాన్ని సమకూర్చాయి. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని మించి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ఈ.మహేంద్రనాథ్, ఏడీఎం, ఏలూరు

అధిక ఆదాయంతో..



పశ్చిమగోదావరి జిల్లాలోని పది మార్కెట్ కమిటీల పరిధిలో ఉండి మార్కెట్ కమిటీ అధిక శాతం పన్ను వసూలు చేసి ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఇక్కడి అధికారులు అత్యధికంగా రూ.9.20 కోట్ల లక్ష్యానికి గాను రూ.11.42 కోట్లు వసూలు చేశారు.

– సునీల్‌కుమార్, ఏడీఎం, భీమవరం

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం



పెనుగొండలో ఆర్‌బీకేను పరిశీలిస్తున్న కలెక్టర్

పెనుగొండ: రైతులను ఇబ్బందులు పెట్టే విధంగా ధాన్యం కొనుగోళ్లలో రైసు మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. బుధవారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైసు మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రైసు మిల్లర్లు చిరిగిన సంచులు ఇస్తున్నారని, తిరిగి ధాన్యం తగ్గిపోయిందని కోత విధిస్తున్నారని, అలాగే ఆర్‌బీకేలో ఉన్న తేమ శాతం మీటర్‌కు, రైసు మిల్లరు వద్ద ఉన్న మీటరుకు రెండు శాతం తేడా ఉంటుందన్నారు. దీంతో పాటు నూక శాతం పేరుతో పెనుగొండ, పెరవలి మండలాల్లో పలువురు రైసుమిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైసుమిల్లర్లు ఇబ్బంది పెడితే తహసీల్దార్, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆచంట తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. మండలంలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీకి 26 మంది ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెచ్‌సీఎల్ టెక్ బీ 'క్యాంపస్ డ్రైవ్' కెరీర్ ప్రోగ్రాంకు 26 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. 105 మంది అభ్యర్థులు హాజరు కాగా తొలిదశలో 26 మంది అర్హత సాధించారన్నారు. ఐటీ రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇదో సదవకాశమన్నారు. హెచ్‌సీఎల్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ హెచ్‌సీఎల్ వంటి పెద్ద సంస్థల్లో చేరటానికి ఇది మంచి అవకాశమని, దేశంలో వీరికి 8 శాఖలు ఉన్నాయని చెప్పారు. ఐటీ రంగంలో భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని యువత వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. సీడాప్ జేడీ ఎం.పార్థసారథి మాట్లాడుతూ మొదటి రౌండ్ పూర్తి చేసిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, చిత్రంలో జేసీలు రామసుందర్‌రెడ్డి, లావణ్యవేణి

తణుకు అర్బన్: రబీ సీజన్‌లో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, ప్రతి ధాన్యం గింజనూ కొంటామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏఒక్క రైతుకూ నష్టం రానివ్వకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశాలు నిర్వహించి కార్యాచరణపై చర్చిస్తున్నారని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోయిన మాట వాస్తవమని అయితే ఎక్కువ శాతం యంత్రాలతో కోత వల్ల ధాన్యం రాశుల రూపంలో భద్రంగా ఉందన్నారు. ఇప్పటికే కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మొబైల్ మినీ మిల్లులు ఏర్పాటుచేసి తహసీల్దార్, మిల్లర్, రైతు సమక్షంలో ధాన్యాన్ని ఆడించి ఎంతశాతం నూక వస్తుందో నిర్ధయిస్తున్నామని, పశ్చిమగోదావరి జిల్లాలో సైతం ఇదే విధానాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు.

మద్దతు ధర అందించేలా..

రైతు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.1,530 రైతుకు అందేలా చర్యలు తీసుకున్నామని మంత్రి కారుమూరి అన్నారు. సంచుల కొరత రానివ్వబోమని సంచులు, హమాలీ, రవాణా ఖర్చులను ధాన్యం డబ్బులతోపాటు రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా వేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసే క్రమంలో మినీ మిల్లింగ్ మెషీన్లను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. వీటి ద్వారా తక్కువ సమయంలో ధాన్యాన్ని పరిశీలించి మిల్లులకు తరలించే సౌకర్యం ఉంటుందన్నారు. ఇప్పటివరకు రైతుల ఖాతాకు రూ.246 కోట్ల ధాన్యం సొమ్ములను ప్రభుత్వం జమచేసిందన్నారు. మిల్లుల వద్ద ధాన్యం లారీలు క్యూలో ఉండేలా కాకుండా ఆయా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ధాన్యాన్ని కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని అన్నారు. రానున్న 10 రోజుల్లో పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేసిందన్నారు. సంచులు, ఇతర ఖర్చుల కోసం ప్రతి కలెక్టర్ వద్ద రూ.కోటి నిధులు అందుబాటులో ఉంచామన్నారు.

చంద్రబాబుది దుష్ట రాజకీయం

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చంద్రబాబు హయాంలో నడిచిన దళారీ వ్యవస్థను సీఎం జగన్ ప్రభుత్వం తొలగించి రైతుల ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి కారుమూరి విమర్శించారు. టీడీపీకి చెందిన రైతులు సైతం ఈ విధానం బావుందని బహిరంగంగా చెబుతుండటాన్ని చంద్రబాబు ఓర్వలేక అటువంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు వచ్చిన సందర్భాల్లో చిన్నపాటి ఇబ్బందులు ఉంటాయని వాటిని రాజకీయంగా వాడుకోవడం దారుణమన్నారు. పౌరసరఫరాల శాఖ ఎండీ వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్లు ఎస్.రామసుందర్‌రెడ్డి (పశ్చిమగోదావరి), లావణ్యవేణి (ఏలూరు), తేజ్‌భరత్ (తూర్పుగోదావరి), ఐదు జిల్లాల పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

వేడుకగా ఎదుర్కోలు ఉత్సవం



హనుమద్వాహనంపై శ్రీవారి ఊరేగింపు



ఎదుర్కోలు ఉత్సవంలో హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో చినవెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణోత్సవానికి ముందు రోజు ఎదుర్కోలు ఉత్సవాన్ని జరపడం సంప్రదాయం. వేడుకలో భాగంగా వెండి శేష వాహనంపై కల్యాణ మూర్తులను ఉంచి, అర్చకులు హారతులిచ్చారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను, రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను కొనియాడారు. వివాహం జరిగే ముందు రోజు వధూవరుల తరఫు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలు ఉత్సవమని పండితులు చెబుతున్నారు. ఉదయం హనుమద్వాహనంపై, రాత్రి వెండి శేషవాహనంపై జరిగిన శ్రీవారి తిరువీధి సేవలు నేత్రపర్వమయ్యాయి. ఆలయ ముఖ మండపంలో స్వామివారు సత్యభామ శ్రీకృష్ణుల అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణం వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై తిరువీధి సేవ
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిగీతాలు
- మధ్యాహ్నం 12 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 4 గంటల నుంచి భక్తిగీతాలు
- సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం
- అనంతరం వెండి గరుడ వాహనంపై తిరువీధి సేవ
- శ్రీవారి ప్రత్యేక అలంకరణ : మోహిని

నేడు కల్యాణోత్సవం



కల్యాణ వేదిక

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం సర్వం సిద్ధం చేస్తోంది. ఆలయ అనివేటి మండపంలో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో కల్యాణ మండప ప్రాంతంతో పాటు క్షేత్ర పరిసరాలను ముస్తాబు చేశారు. స్వామివారు ఆలయం నుంచి తూర్పురాజగోపురం మీదుగా కల్యాణ వేదిక వద్దకు రాత్రి 8 గంటల సమయంలో చేరుకుంటారు. అనంతరం కల్యాణ తంతు జరిపిస్తారు. శుక్రవారం రాత్రి చిన వెంకన్న రథోత్సవం నిర్వహించనున్నారు.

అన్నదాతకు అండగా..

- వరి రైతులకు సర్కారు భరోసా
- తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు
- పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్లు



దెందులూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అన్నదాతకు సర్కారు అండగా నిలిచింది. అకాల వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసి నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించి నేరుగా పొలాలను సందర్శించి నష్టం అంచనా వివరాలను తయారు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాళ్వా కోతలు జరుగుతుండగా రెండు రోజులుగా కొనుగోళ్ల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.

'వరి'వడిగా కొనుగోళ్లు

ఏలూరు జిల్లాలో 1,98,328 టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 6,40,000 ధాన్యం దిగుబడి అంచనా వేసి గత నెల నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 1.10 లక్షల టన్నుల ధాన్యాన్ని 9,503 మంది రైతుల వద్ద కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.224 కోట్లు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల టన్నుల కొనుగోలు చేసి రూ.113.70 కోట్లను రైతుల ఖాతాలకు జమచేయగా మరో రూ.173.23 కోట్లు అందించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో రైతులకు 40 లక్షల గోనె సంచులు అందించారు. అలాగే రవాణాకు ఇబ్బంది లేకుండా వంద లారీలను అందుబాటులో ఉంచారు.

కలెక్టర్ల ఆదేశాలతో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌ల ఆదేశాలతో ఏలూరు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఆర్డీఓలు ధాన్యం కల్లాలను పరిశీలించారు. తడిసిన ధాన్యం రవాణా, మిల్లర్లు, డ్రయర్ల ద్వారా ఆరపెట్టేలా ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలాల వారీగా పెదవేగిలో ఒకటి, భీమడోలులో ఒకటి, ఉంగుటూరులో మూడు, జంగారెడ్డిగూడెంలో రెండు, కలిదిండిలో ఒకటి చొప్పున మొత్తం 8 గ్రామాల్లో పంటకు స్వల్ప నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాల్లో 44.8 హెక్టార్లలో వరి దెబ్బతినగా 11,048 టన్నుల ఆరబెట్టిన ధాన్యం తడిచినట్టు అధికారులు అంచనా వేశారు. అలాగే 430 టన్నుల మొక్కజొన్న సైతం నష్టానికి గురైనట్టు అంచనా వేశారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, పౌరసరఫరాల శాఖ మేనేజర్ మంజుభార్గవి రైతుల పంట నష్టాలు, ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నారు.

రైతులూ.. అధైర్యపడొద్దు : మంత్రి కారుమూరి

రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి ప్రత్యేక చర్యలు తీసుకునేలా అన్ని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. తణుకులో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల రైస్‌మిల్లర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించి తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా రైతుకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించామని అన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కూలీ మృతి



కరెంటు వైర్ తెగిపడి మృతి చెందిన కూలీ

నరసాపురం రూరల్: నరసాపురం మండలం చామకూరిపాలెంలో విద్యుత్ వైర్ తెగిపడి వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మొగల్తూరు ఎస్సై ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన కంకటాల వెంకట్రావు (50) బుధవారం ఉదయం పనికి వెళుతూ చామకూరిపాలెం వద్ద కాల్వగట్టుపై బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి సైకిల్ ఎక్కేందుకు వస్తుండగా అప్పటికే అక్కడ తెడిపడి ఉన్న విద్యుత్‌వైర్‌పై కాలు వేయడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వానలతో వ్యాధుల ముప్పు



బుట్టాయగూడెం మండలం వీరమద్దిగూడెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేస్తున్న దృశ్యం

- దోమల నివారణకు చర్యలు చేపట్టిన అధికారులు
- జ్వరాలు వ్యాపించకుండా గ్రామాల్లో వైద్యశిబిరాలు

బుట్టాయగూడెం: ప్రస్తుతం వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో వ్యాధులు వ్యాపించే అవకాశముందని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఈ మార్పులతో వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచిస్తున్నారు.

వేసవిలో తీవ్రమైన ఎండల కారణంగా చెరువులు, కాలువలు, గుంటలు ఎండిపోతాయి. మే నెల వచ్చే సరికి ఎండిన చెరువులు, కాల్వలు దర్శనమిస్తాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే వర్షాలు కురుస్తుండడంతో వరద నీరు వచ్చి చేరింది. గ్రామాల్లో, రోడ్లు, డ్రైనేజీల్లో కూడా మురుగు నీరు నిలిచిపోయింది. వీటి వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున మలేరియా అధికారులు దోమల నివారణపై దృష్టి పెట్టారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కలిగిస్తున్నారు. దోమతెరల వినియోగంపై కూడా అవగాహన కలిగిస్తున్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల ఎలాంటి వ్యాధులు వ్యాపించకుండా ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒకపక్క 104 వాహనంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తుండగా మరోపక్క వైద్య బృందాలు మారుమూల గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అధికారులు ముమ్మరంగా చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినొద్దు. జ్వరం వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి.

–డాక్టర్ ఏఎస్‌వీ ప్రవీణ్,
దొరమామిడి పీహెచ్‌సీ, బుట్టాయగూడెం మండలం

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు



అకాల వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాం. దోమల నివారణకు మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. ప్రజలు తప్పనిసరిగా దోమ తెరలు వినియోగించుకోవాలి.

–పి.పెద్దిరాజు,
మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్, బుట్టాయగూడెం

కొల్లేరు బెల్ట్ భూముల సర్వే

కలెక్టర్ ఆదేశాలు



ప్రత్తికోళ్లలంకలో కొల్లేరు భూములు

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల్లో అక్రమ భూముల గుట్టు రట్టు కానుంది. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కొల్లేరు పరిసర గ్రామాల్లో ఫీల్డ్ లెవెల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ లాండ్, రికార్డ్స్(ఎఫ్‌పీఓఎల్ఆర్) సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. కొద్దిరోజులుగా ఏలూరు మండలం ప్రత్తికోళ్ళలంక పరిసర అభయారణ్యంలో పట్టా భూముల పేరుతో చేపట్టిన అక్రమ తవ్వకాలపై అటవీశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మీరాజు అనుచరులు అటవీశాఖ సిబ్బందిపై దాడి వివరాలు తెలిపారు. దీంతో కలెక్టర్ వారంరోజుల క్రితం ఎఫ్‌పిఓఎల్ఆర్ సర్వే వేగవంతం చేయాలని అధికారులకు సర్క్యులర్ జారీ చేసారు. దీంతో కొల్లేరు బెల్ట్ గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టా భూములతో పాటు ఫారెస్ట్ భూముల సరిహద్దులు తేలనున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు అభయారణ్య పరిసర మండలాలు ఏలూరు, పెదపాడు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు, మండవల్లిలో సర్వే చేసేందుకు తహసీల్దార్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో ఏలూరు రెవెన్యూ డివిజన్ అధికారి పెంచల కిషోర్ ఈ మొత్తం పక్రియ పర్యవేక్షిస్తారు. ఈ మొత్తం పక్రియ పూర్తి కాగానే కొల్లేరు బెల్ట్ గ్రామాల్లో రెవెన్యూ భూములు, ఫారెస్ట్ భూముల మొత్తం లెక్క తేలనుంది.

8,800 ఎకరాల్లో అక్రమ చెరువులు

గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు కొల్లేరు అభయారణ్యంలో పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరిపారు. 2019 మార్చి నాటికి అభయారణ్యంలో 8800 ఎకరాల్లో అక్రమ చెరువులు ఉన్నాయని అటవీశాఖ అధికారులు సైతం ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో 4403 ఎకరాలు ప్రభుత్వ భూములు కాగా మరో 4396 ఎకరాలు కొల్లేరు ప్రక్షాళనలో ప్రభుత్వం పరిహారం ఇచ్చి కొట్టేసిన చెరువు భూములుగా గుర్తించారు.

పోక్సో కేసులో ఐదుగురి అరెస్టు



టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టు చేసిన నిందితులతో ఎస్సై సతీష్‌కుమార్, సిబ్బంది

టి.నరసాపురం: పోక్సో కేసులో మండలంలోని బొర్రంపాలెంకు చెందిన ఐదుగురు వ్యక్తులను నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్ బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కర్రిపోతు సాయి దుర్గాబాబు అదే గ్రామానికి చెందిన బాలికను గత నెల 20న కిడ్నాప్ చేసి అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదుపై గత నెల 30న ఐదుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు. మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో సాయిదుర్గాబాబుతో పాటు కర్రిపోతు సునీత, గూట్ల దుర్గాప్రసాద్, గూట్ల రాహుల్, గూట్ల ఇస్సాకులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఏఈఓ విధులు మార్పు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలి దర్శన వివాద విషయంలో ఆలయ ఏఈఓ విధులను మార్పు చేస్తూ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవారి దర్శనార్థం మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు బోడపాటి మౌనిక తనను ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణ చేపట్టిన ఆలయ ఈఓ త్రినాథరావు ఏఈఓ దుర్గారావును గోసంరక్షణశాలకు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓ పి.నటరాజారావును ఆలయ కార్యాలయానికి బదిలీ చేశారు. మద్దాల శ్రీనుని ఆలయ కార్యాలయ ఇన్‌చార్జ్ సూపరింటిండెంట్‌గా నియమించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేట గ్రామం రైల్వే గేటు సమీపంలో రైలు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట గ్రామ రైల్వేగేటు సమీపంలో సుమారు 70 నుంచి 75 ఏళ్ళ వయస్సు కలిగిన వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. చనిపోయి సుమారుగా 4 లేక 5 రోజులు కావటంతో మృతదేహం ఉబ్బిపోయి గుర్తించేందుకు వీలులేకుండా ఉంది. రైల్వే హెచ్‌సీ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 80740 55378కు సంప్రదించాలని కోరారు.

సబ్‌సెంటర్ తనిఖీ



సబ్‌సెంటర్ తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

పోదూరు: మండలంలోని కవిటం సబ్ సెంటర్‌ను డీఎం అండ్ హెచ్‌ఓ డి.ఉమామహేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవల గురించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డీఎం అండ్ హెచ్‌ఓ వెంట మండల హెల్త్ ఆఫీసర్ డా.ఎల్ కామరాజు తదితరులున్నారు.

రాజమండ్రి వెళ్లి పింఛన్ అందజేత



రాజమండ్రిలోని హాస్పిటల్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన చేబోలు ఆంజనేయులు గుండె సంబంధిత వ్యాధితో రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆంజనేయులు ప్రతి నెల వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నాడు. ఈ నెలకు సంబంధించిన పింఛన్ అందజేయడానికి వెళ్లిన వలంటీర్ సీహెచ్ బాల నాగశ్రీ అతను ఆసుపత్రిలో ఉన్నాడని తెలుసుకొని సొంత ఖర్చులతో బుధవారం రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న ఆంజనేయులు బాలనాగశ్రీని చూసి సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపాడు. బాలనాగ శ్రీని గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా వలంటీర్ మాట్లాడుతూ సేవ చేయాలని ఆలోచన ఉంటే ఎంత దూరం వెళ్లిన శ్రమ అనిపించదని అన్నారు.

కలెక్టర్‌కు రెడ్ క్రాస్ అవార్డు



కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి రెడ్ క్రాస్ అవార్డు లభించింది. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలు, సభ్యత్వ నమోదు తదితరర సేవలు గుర్తించి ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 8వ తేదిన రాజ్ భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు అందుకోనున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన 17 ఏళ్ళ బాలిక అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన మహిళ రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నెల 1వ తేదీ ఉదయం 4:30 గంటలకు నిద్రలేచి చూసేసరికి తనకుమార్తె కనిపించకపోవడంతో తెలిసిన వారందరి వద్ద వెదికింది. చివరకు కుమార్తె కనిపించలేదంటూ ఆమె పోలీసులను ఆశ్రయించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● గడపగడపకు సంక్షేమం



ఉండి: మండలంలోని కలిగొట్లలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

తడిసిన ధాన్యం కొంటాం



గురవాయిగూడెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ



అడవికొలనులో సూచనలిస్తున్న సీఈవో రవికుమార్

జంగారెడ్డిగూడెం రూరల్: గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీరాణి తెలిపారు. బుధవారం మండలంలోని గురవాయిగూడెంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అవకాశం ఉన్నంత మేరకు ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని పూర్తి స్థాయిలో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తహసీల్దార్ కె.స్లీవ జోజి, మండల వ్యవసాయాధికారి పోశారావు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తాం

నిడమర్రు: అకాల వర్షాలతో తడిసిన ధాన్యం ఆయా స్థానిక రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా పరిషత్ సీఈవో, ప్రత్యేక అధికారి రవికుమార్ రైతులకు ధైర్యం చెప్పారు. బుధవారం పెదనింద్రకొలను, అడవికొలను గ్రామాల పరిధిలోని సొసైటీ వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి కొనుగోళ్ల రికార్డులు పరిశీలించి మాట్లాడారు. నిడమర్రు మండలంలో 16,986 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా నేటివరకూ 11,082 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ధాన్యం ఈనెల 6లోపు కొనుగోలు పూర్తి చేసి టార్గెట్ పూర్తి చేయాలని సీఈవో రవికుమార్ వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో గోనెసంచుల ఇబ్బంది లేదని రైతులు తెలిపారు. సకాలంలో ధాన్యం కొనుగోలు సొమ్ములు ఖాతాల్లో జమచేసేలా కృషి చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, తాహసీల్దారు బి. సాయిరాజు, ఏవో బిస్సీబాబు థామస్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం నర్సయ్య అగ్రహారానికి చెందిన కింజంగి పవన్‌కుమార్ కన్పించడం లేదంటూ భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పవన్‌కుమార్ చెడువ్యసనాలకు బానిసై అప్పడప్పుడు ఇంటినుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగివచ్చేవాడు. ఏప్రిల్ 7న ఇంటినుంచి బయటకు వెళ్లిన పవన్‌కుమార్ తిరిగిరాకపోవడంతో అతని భార్య భవాని ఫిర్యాదు చేసింది.

టీడీఎస్ వసూలుపై హైకోర్టు స్టే

నూజివీడు: పీఏసీఎస్‌లలో రైతుల నగదు లావాదేవీలపై టీడీఎస్ పన్ను 2 శాతం వసూలు చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై ఏపీ హైకోర్టు స్టే విధించిందని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వర రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2019 లో ఏబ్యాంకు లోనైనా ఖాతాదారులు జరిపే నగదు లావాదేవీలపై టీడీఎస్ 2 శాతం వసూలు చేయాలని నిబంధన విధించిందన్నారు. టీడీఎస్ వసూలు నిర్ణయంపై ఉమ్మడి కృష్ణా జిల్లా సహకార ఉద్యోగుల అసోసియేషన్ తరపున వేసిన కేసులో హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని నీలం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం-బాదంపూడి రైల్వే స్టేషన్ మధ్య ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించామని గూడెం జీఆర్‌పీ ఎస్‌ఐ జి.శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో మృతుడు రైలు నుంచి జారిపడి మరణించి ఉంటాడని భావిస్తున్నామన్నారు. అన్నవరం నుంచి విజయవాడ వరకు తీసుకున్న టికెట్ మృతు ఛిట వద్ద లభించిందన్నారు. బ్లూకలర్ జీన్‌ప్యాంటు, ఎరుపు నలుపు రంగు కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 9490970541 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



వీ రాకేష్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉంటున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి చెందిన వీ.రాకేష్(21) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో రాకేష్ తోటి విద్యార్థులతో ఈ2 వసతిగృహంలోని తన గదికి వెళ్తూనే ఒక్కసారిగా సెకండ్ ఫ్లోర్ నుంచి కిందకు దూకాడు. దీంతో అతనిని వెంటనే ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే ఉన్న ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. రాకేష్‌ది విజయనగరం జిల్లాలోని గొలిజం స్వగ్రామం. మూడు రోజులుగా అతను ముభావంగా ఉంటున్నాడని తోటి విద్యార్థులు ఫ్యాకల్టీకి చెప్పడంతో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 4న విద్యార్థులందరూ ఇంటికి వెళ్తుండగా, ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమా? ఇంకేమైనా కారణమా అని పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

పాలకోడేరు: గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్సై నాళం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గరగపర్రులో సీహెచ్‌ఎస్‌వీ వరప్రసాద్, డి.సత్యనారాయణ, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. గరగపర్రు శివారు చిలుకూరు రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని సిబ్బందితో కలిసి వెంబడించి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.27,500 విలువ చేసే 5,500 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇంటి ముంగిటకే ఫ్యామిలీ వైద్యసేవలు

- పేదల పాలిట వరంగా ఫ్యామిలీ ఫిజీషియన్
- గ్రామాల్లో ఉచిత వైద్యపరీక్షలు
- ప్రజల్లో హర్షాతిరేకాలు


ఫ్యామిలీ వైద్యపరీక్షలలో భాగంగా వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వైద్యవిధానం దేశం యావత్తూ హర్షిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఉన్నతికి పథకాలతో పాటు, విద్య, వైద్యం ద్వారా అందిస్తున్న సేవలు మరువలేనివి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం పేదలపాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకొన్నవారు, గర్భిణులు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన అనంతరం నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. గతంలో ట్రయల్ రన్ ద్వారా వైద్యాధికారులు స్థానిక పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తూ గ్రామాల్లో ఇంటింటికి వైద్యపరీక్షలు చేశారు. కాగా నేడు వైద్యులు పూర్తిస్థాయిలో ఉండటంతో ప్రత్యేక షెడ్యూల్ ద్వారా గ్రామాల్లో సుమారు 4 నుంచి 6 రోజులు వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో రోగులు ప్రభుత్వ డాక్టర్లు అందించే సేవలకు అలవాటు పడ్డారు. గతంలో గ్రామీణులకు ఎన్ని జబ్బులు చేసినా, పెద్ద జబ్బు వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణాలకు పరుగుపెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్దేశిత సమయంలో గ్రామాల్లో వైద్యబృందం వచ్చి రోగులకు నిశితంగా పరీక్షలు చేసి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈ వైద్యబృందాలు వచ్చేటప్పటికి విశేష స్పందన కనిపిస్తోంది. గూడెం నియోజకవర్గంలో 50కి పైగా గ్రామాల్లో 309 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో సుమారు 25 వేల మంది వైద్యసేవలు పొందారు. దీంతో పేదలకు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా వారిలో కనిపిస్తోంది. షుగర్, బీపీ పేషెంట్లకు భరోసా, గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వీటివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి ప్రతి నెలా రక్తం, యూరిన్ తదితర పరీక్షలు చేయిస్తోంది. ట్రయల్ రన్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నెలలో పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా గర్భిణులు 291, బాలింతలు 98, రక్తహీనత 10 మంది, బీపీ రోగులు 1693, షుగర్‌వ్యాధిగ్రస్తులు 897, జనరల్ ఓపీ 600, టీబీ, ఇతర పేషెంట్‌లు మరో 34 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గూడెం నియోజకవర్గంలో సుమారు వేల మంది బీపీ, షుగర్ రోగులకు సేవలు అందుతున్నాయి.

ప్రతి నెల పరీక్షలు



ప్రతి నెలా వైద్యబందం గ్రామానికి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాము. వారంలో ప్రత్యేక షెడ్యూల్ ద్వారా గ్రామాల్లో ఉండి పరీక్షలు చేస్తున్నాము. ప్రజలుకూడా వీటికి అలవాటుపడ్డారు. రిఫరల్ కేసులు కూడా చెక్ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్‌లు చేయించుకొన్న వారినికూడా ప్రత్యేక దృష్టితో చూస్తున్నాం.

– డాక్టర్ తోట రాజేష్,
మెడికల్ అధికారి, పెంటపాడు

అందుబాటులో ఉంటున్నాం



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామ హెల్త్ క్లినిక్‌లకు వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ రోగులకు సేవలు అందిచడమేకాక గర్భిణీలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొంటున్నాం. ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించుకొన్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ రమణ,
ముదునూరు పీహెచ్‌సీ

జగనన్న కాలనీలు త్వరగా పూర్తి చేయాలి


ఇరగవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అలివేలు మంగతాయారు

ఇరగవరం: మండలంలో జగనన్న కాలనీలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకొనే చర్యలు చేపడతామన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరిగే చోట విద్యుత్, నీటి సరఫరాకి ఇబ్బందులు లేకుండా ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కొన్ని శాఖలకు సంబంధించి అధికారులు గైర్హాజరు కావడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఈవో పీఆర్డీ వై.మునిరాజు, మండల స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దంచి కొట్టిన వాన


గూడెం పట్టణంలో వాన కురుస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నల్లనిమేఘాలు ఆవరించి వాన బుధవారం దంచి కొట్టింది. అరగంటపాటు నిరంతరాయంగా వర్షం పడటంతో రోడ్లపై కొద్దిసేపు నీరు నిలిచిపోయింది. మారిన వాతావరణంతో అందరూ ఒక్కసారిగా రిలాక్స్ అయ్యారు. మారిన వాతావరణాన్ని అందరూ ఆస్వాదిస్తుండగా, రైతులు, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా పాతూరు రామాలయం విగ్రహ ప్రతిష్ఠ


పాతూరు రామాలయం విగ్రహ ప్రతిష్ఠ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పాతూరు రామాలయం విగ్రహ పునః ప్రతిష్ఠలో భాగంగా రెండోరోజు బుధవారం ఆలయం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అనంతరం పునః నిర్మాణ కమిటీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద నుంచి రామాలయం వరకు గ్రామోత్సవం జరిగింది. అనంతరం అంకురార్పణ, యోగశాల ప్రవేశం, కుంభారాధన, ద్వారపూజలు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కర్రి సీతారామయ్య, పునః నిర్మాణ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో సక్రమంగా పనిచేయాలి


అంగన్ వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు విధుల్లో సక్రమంగా పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం నూతనంగా నియామకమైన తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 5గురు అంగన్ వాడీ కార్యకర్తలు, 5గురు సహాయకులకు నియామక పత్రాలు మంత్రి కారుమూరి అందజేశారు. చిన్నారులకు మంచి సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఎంబీఎస్ ప్రమోదకుమారి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి కారుమూరి


దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు: తణుకు మండలం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్ కర్రెల్ల తేజ వివాహ వేడుకలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంట వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మవారికి బంగారం బహూకరణ


మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పొడగట్లపల్లికి చెందిన భూపతిరాజు రామకేశవ బంగార్రాజు– సత్యవతి దంపతులు 16 గ్రాముల బంగారం, 1.50 కిలోల వెండిని సమర్పించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరావు, ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, రామాయణం సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర


అత్తిలిలో శ్రీహనుమాన్ శోభాయాత్ర బైక్‌ర్యాలీలో పాల్గొన్న హిందువులు

అత్తిలి: శ్రీహనుమాన్ శోభాయాత్ర అత్తిలి పురవీధుల్లో నేత్రపర్వంగా సాగింది. బుధవారం సాయంత్రం ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం వరకు జరిగింది. హనుమాన్ శక్తిజాగరణ సమితి శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలో అత్తిలి మండలం నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు. హనుమాన్ జెండాలు చేతబట్టుకుని, గ్రామంలో శ్రీహనుమాన్ శోభాయాత్ర విజయవంతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి శృంగవృక్షం దత్తపీఠం సాయిదత్త నాగానంద సరస్వతి స్వామిజీ, ఉజ్జయిని అఘోరి సంస్థాన్ నుంచి రాజేష్‌నాథ్ అఘోరాజీ హాజరైయ్యారు. ఈసందర్భంగా బాలాజీ వెంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో పలువురు వక్తలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అత్తిలి మండలంలోగల గ్రామాల నుంచి వందలాది హిందువులు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి


భీమవరంలో ఈకేవైసీ నమోదు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవివర్మ

సాక్షి, భీమవరం: పింఛన్‌దారులు విధిగా తమ సీఎంఎఫ్ఎస్ ఐడీలను ఆధార్ లింక్ చేసిన మొబైల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవాలని భీమవరం ఉప ఖజానాధికారి ఎ రవివర్మ అన్నారు. బుధవారం భీమవరంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటుచేసిన ఈకేవైసీ నమోదుపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదిన పాలకొడేరు, 9న వీరవాసరం మండల పరిషత్ కార్యాలయాల్లో పెన్షన్‌దారులకు ఈకేవైసీ నమోదుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇతర సందేహాలు నివృత్తి చేసుకోడానికి సెల్:99122 43377,63026 18446 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించాలని రవివర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజీసీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జీవీ సత్యనారాయణరాజు, కార్యదర్శి సుబ్బారావు, ఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిట్‌నెస్ తప్పనిసరి


భీమవరంలో ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యార్థులు ఫిటెనెస్ కోసం తప్పనిసరిగా క్రీడలను అలవర్చుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం జగపతిరాజు అన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఎస్ఆర్‌కేఆర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా బుధవారం విజేతలకు బహుమతులు అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానంలో విద్యార్థులు ఫిట్‌నెస్ కోసం క్రీడలు, యోగ వంటి వాటికి కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన బ్లాక్ పాంతర్ టీం కెప్టెన్ బి మణికంఠ, టీమ్ సభ్యులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి హరికృష్ణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సిహెచ్ హరిమోహన్, జి సారిక, వి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామికి ప్రత్యేక పూజలు


ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడులో చెరువుగట్టు వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ దీక్షధారణ, యాగశాల ప్రవేశం అఖండ దీపారాధన లు వేదమంత్రాలు నడుమ నిర్వహించారు. పాండురంగ స్వామి మూలవిరాట్ విగ్రహ ప్రతిష్ఠ శ్రీ వరాహ మూర్తి విగ్రహ ప్రతిష్ఠ శ్రీ నరసింహ స్వామి వారి ప్రవర్తిస్తారు శ్రీకృష్ణుడు విగ్రహ ప్రతిష్ఠ,శికర ప్రతిష్ఠలు తాడి నరసింహ స్వామి, తాడి దుర్గాప్రసాద్, కొప్పుల దుర్గాప్రసాద్, తాడి హేమ దుర్గాప్రసాద్, తాడి శ్రీనివాస్, సుంకర నాగరాజు దంపతులతో నిర్వహించారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అఖండన సమారాధన నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, మంతెన రవి వర్మ మంతెన ఆంజనేయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మంతెన రామకృష్ణంరాజు, దాట్ల బాపిరాజు పాల్గొన్నారు.

అవగాహనతో చదవాలి

ఆకివీడు: అవగాహనతో చదవడం, ఇష్టంతో చదవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.శ్రీకర్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్రకేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, రెండో సంవత్సరం ఉత్తీర్ణత కాని విద్యార్థులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకర్ మాట్లాడుతూ అవగాహనతో చదవడం, రాయడం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మం పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలి


సీపీఎం, సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో


విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిగ్గు ఎగ్గు లేకుండా దేశానికే గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ఎన్నో పోరాటాలు, ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు ఏర్పడిందని, ఆంధ్ర ప్రజల హక్కు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణ ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసి తెలుగు ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిటికిన రాము, పోతు శ్రీను, నరమాల కృష్ణ, మేట్రేటి రమణ, పులిమంతుల రమణ, కె.నానాజీ, జి.సతీష్ కుమార్, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం పెంటపాడు మండలంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు కార్మికులు, కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటం 800 రోజులు పూర్తి చేసుకున్నా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, కళింగ లక్ష్మణరావు, తదతరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలి

ఆకివీడు: ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వర్కర్స్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల సమగ్ర సర్వే యాత్రలో భాగంగా బుధవారం ఆకివీడు వచ్చిన రాష్ట్ర సంఘ నాయకులు స్థానిక నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తూ చనిపోతే రూ. 5 లక్షలు పరిహారం, గతంలో కార్మిక సంఘ సంక్షేమ బోర్డులో గుర్తింపు పొందిన కార్మికులకు పథకాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర కోశాధికారి శ్రీధర్ రవి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను ఢీకొన్న ఘటనలో కేసు నమోదు

పాలకోడేరు: స్థానిక పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న బాలకృష్ణ అనే కానిస్టేబుల్ మంగళవారం మధ్యాహ్నం భోజనానికి తన స్వగ్రామం ఆరవల్లి బైక్ పై వెళ్తుండగా, ఎదురుగా బైక్ పై వస్తున్న వెంప గ్రామానికి చెందిన సునీల్ అనే యువకుడు ఢీ కొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కాలర్ బోన్‌కు తీవ్ర గాయమైంది. స్థానికుల సహకారంతో వెంటనే కానిస్టేబుల్, మోటార్ సైక్లిస్టను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

అత్తిలి: ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 16వ తేదీ వరకు అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, కాగితాలతో చేతి పనులు చేయించడం, జనరల్ నాలెడ్జ్ వంటి కార్యక్రమాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని కృష్ణారావు చెప్పారు.

తణుకు టౌన్: బాల బాలికలు వేసవి సెలవులను ఆహ్లాదంగా, వినోదభరితంగా గడిపేందుకు ఈనెల 8వ తేదీ నుంచి గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించే వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తణుకు మహిళా గ్రంథాలయాధికారి ఎస్ ప్రవీణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరాలు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం ప్రముఖులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొవాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి రైతులకు ప్రోత్సాహం


మోగల్లులో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయ బాబు

పాలకోడేరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తున్నామని టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయబాబు అన్నారు. మండలంలోని మోగల్లు, పాలకోడేరు, కోరుకొల్లు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. వంద రోజులు పని కల్పించాలని లక్ష్యంతో చర్యలు చేపట్టామన్నారు. 26 వేల పని దినాలకు లక్ష్యంగా ఇప్పటికే 25365 పని దినాలను పూర్తి చేశామన్నారు. 9502 జాబ్ కార్డులు ఉన్నాయని రోజుకి 1900 మందికి పైగా కూలీలకు పని కల్పిస్తున్నామన్నారు. మామిడి, జామ, అరటి పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని ఇప్పటికే విస్సాకోడేరు గ్రామంలో పండ్ల తోటలు పెంపకానికి రైతులు ముందుకు వచ్చారన్నారు. ఈయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, వెంకటేష్, అబ్రహం,మేట్లు సునీత తదితరులు ఉన్నారు.

కొబ్బరిచెట్టు నరికివేతపై ఫిర్యాదు

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న కొబ్బరిచెట్టును ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.బాల త్రిపుర సుందరి నరికివేయించారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ కుడక ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు కంబాల తిరుమల వెంకటేశ్వరరావుతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు తోట సుబ్బారావు, తదితరులు తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియన్న పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తపల్లి వెంకట్రామరాజు, లీలాఫణి మాధూరి దంపతులచే స్వామి వారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే బుధవారం ఉదయం స్వామివారికి 108 తులసి మొక్కలతో తులసీ బృందార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణ్యాన్ని తిలకించారు. ఆలయ ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఆలయ చైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యుడు మంతెన రామ్‌కుమార్ రాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు


లీల్లీ పుష్పాల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం శ్రీ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ స్వామివారికి నిత్యార్చన, బలిహరణ, నిత్యోపాసన పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీ స్వామి అమ్మవార్లకు లిల్లీ పుష్పాలతో సహస్రనామ పుష్పార్చన నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివారికి వేద మంత్రోచ్చారణల పల్లకీ సేవ గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ మోకా అరుణ్ కుమార్, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.